భారత సైనికులకు వందనం

- కాల్పుల విరమణను స్వాగతిస్తున్నం
- అమరులకు ఘన నివాళి : కవిత

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ) : భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'భారతీయులను కాపాడేందుకు ప్రాణాలొడ్డి పోరాడిన సైనికులకు వందనం.. ఈ పోరాటంలో అసువులు బాసిన భారత జవాన్లకు ఘనమైన నివాళి. అయితే విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేయడం ఆశ్చర్యమనిపించింది. మన ప్రధాని ఈ విషయాన్ని స్వయంగా వెల్లడిస్తే భారత గొప్పతనం మరింత ఇనుముడించేది. ఏదేమైనా కాల్పులు విరమణ శుభపరిణామం. సాధ్యమైనంత తొందరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించి భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తిరిగి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి' అని సూచించారు.



త్రీడీ టెక్నాలజీతో ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు సిద్ధం చేసిన సురక్షిత బంకర్లు

త్రీడీ టెక్నాలజీతో సురక్షిత బంకర్లు

- మెటీరియల్ సైన్స్ పరిజ్ఞానంతో అభివృద్ధి
- సైన్యానికి వజ్రకవచమన్న ఐఐటీ పరిశోధకులు
- ఐఐటీ హైదరాబాద్ అద్భుత ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 10(నమస్తే తెలంగాణ): భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ ఐఐటీ హైదరాబాద్ చేసిన ఆవిష్కరణ సైనికులకు ఎంతో భరోసా ఇచ్చేలా ఉంది. శత్రు దాడులను సమర్థంగా ఎదుర్కొని, ఎలాంటి ప్రాణనష్టం లేకుండా దృఢమైన రక్షణ గోడలను నిర్మించే టెక్నాలజీని ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. త్రీడీ టెక్నాలజీ ఆధారంగా అత్యంత దృఢమైన బంకర్లను నిర్మించింది. సముద్ర మట్టానికి 11వేల అడుగుల ఎత్తులో ఉండే లేహ్‌లో సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ సంస్థతో కలిసి భారత ఆర్మీ కోసం ఐఐటీ హైదరాబాద్ బంకర్లు నిర్మించింది. అతి తక్కువ ఆక్సిజన్ స్థాయిలోనూ సైనికులు సమర్థంగా పనిచేసేలా ఈ నిర్మాణ శైలి ఉంది. దేశంలోనే తొలి త్రీ డీ ప్రింటింగ్ బంకర్ నిర్మాణాన్ని ఆవిష్కరించారు.

అత్యధిక ఎత్తులో, అతి తక్కువ ప్రాణ వాయువు లభించే లేహ్ లాంటి ప్రాంతంలో ఈ తరహా నిర్మాణం అత్యంత క్లిష్టమైనది. ఇలాంటి వాతావరణ పరిస్థితుల్లో ఇది అసాధ్యం కాగా, ఐఐటీ-హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రహ్మణ్యం, పీహెచ్‌డీ స్కాలర్ అరుణ్ కృష్ణన్ సారథ్యంలో మెటీరియల్ సైన్స్‌ను ఉపయోగించి ఈ త్రీడీ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. కాంక్రీట్ మిక్స్‌తో ఈ త్రీడీ ప్రింటింగ్ నిర్మాణం సమర్థవంతంగా పని చేస్తుందని, అధిక అతినీలలోహిత కిరణాల నుంచి కూడా సైనికులకు రక్షణ కల్పిస్తుందని వారు పేర్కొన్నారు. 24గంటల్లోనే బంకర్లను నిర్మించవచ్చని, భారత సైన్యానికి వజ్రకవచంలా నిలుస్తుందని ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు తెలిపారు.

నాంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల మాజీ నాయకులు

ప్రజలు, ఉద్యోగుల మధ్య సీఎం చిచ్చు

- రేవంత్‌కు వ్యతిరేకంగా ఏకమవుతున్న ఉద్యోగులు
- అన్ని ఉద్యోగ సంఘాలతో సమన్వయ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- డిమాండ్ల సాధన కోసం సమావేశమైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల మాజీ నాయకులు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఉద్యోగులపై సీఎం వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఏకమవుతున్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించి కీలక సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ సంఘాల మాజీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా తెలంగాణ సమస్యలపై కలిసి ఉద్యమించిన ప్రజలను, ఉద్యోగులను విడదీసేలా సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగులను ఉద్దేశించి రేవంత్ చేసిన వ్యాఖ్యల పట్ల తెలంగాణ సమాజం ఆవేదన చెందుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలోనే తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పాటు కోసం అన్ని సంఘాలను సమన్వయం చేసేందుకు, తా ము ఒక సమన్వయ కమిటీగా ఏర్పడాలన్న కీలక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సుదీర్ఘకాలం పాటు క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమించి, అనేక పోరాటలు నడిపి, వివిధ ప్రభుత్వాల్లో తమ హక్కులను సాధించడంలో ముందు వరుసలో నిలబడి, ప్రయోజనాలను చేకూర్చిన రాష్ట్ర స్థాయి మాజీ నాయకులంతా సమావేశమైనట్టు వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం మాజీ చైర్మన్ జీ దేవీప్రసాద్‌రావు, టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు సీ విఠల్, టీఎన్‌జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ఎస్టీయూటీఎస్ పూర్వ అధ్యక్షుడు బీ భుజంగరావు, టీఎన్‌జీవో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం ఏ హమీద్, ఏ పద్మాచారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, టీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఇంజమూరి రఘునందన్, రెవెన్యూ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మఠం శివశంకర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యులు సుమిత్రానంద్ తానోబా, ఎస్టీయూటీఎస్ మాజీ అధ్యక్షుడు ఏ లక్ష్మణ్, పాలిటెక్నిక్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు వై నర్సయ్యగౌడ్ , టీపీటీయూ మాజీ అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, టీజీహెచ్‌ఎంఏ మాజీ అధ్యక్షుడు గుండం మోహన్‌రెడ్డి, ఎంపీడీవోల రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు, ఫారెస్టు ఉద్యోగుల ఫోరం కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి విష్ణువర్ధన్, టీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు హాసన్, ఎల్ శ్రీనివాస్‌రెడ్డి, కూరపాటి రంగరాజు, ఎం శ్యామ్‌రావు పాల్గొన్నారు.

మూడ్రోజులు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్ మే 10 (నమస్తే తెలంగాణ): ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. రానున్న మూడ్రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని శనివారం ప్రకటనలో పేర్కొన్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని తెలిపింది. ఆదివారం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నదని వెల్లడించింది. ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

కర్రెగుట్టలో 'ఆపరేషన్ కగార్'కు బ్రేక్

ములుగు, మే 10 (నమస్తేతెలంగాణ): మావోయిస్టుల ఏరివేతలో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రాల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులుగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు బ్రేక్ పడినట్టు తెలుస్తున్నది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టల్లో ఉన్న పోలీస్ బలగాలను వెనక్కి పిలిచినట్టు సమాచారం. సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లు తమ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశాలు చేసినట్టు తెలిసింది. ఛత్తీస్‌గఢ్ వైపు సీఆర్‌పీఎఫ్-217, 81, 86 బెటాలియన్లు, జీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ ఆధ్వర్యంలో కగార్ ఆపరేషన్‌ను యథావిధిగా చేపట్టనున్నట్టు తెలిసింది.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

- విశ్రాంత న్యాయాధికారి చంద్రకుమార్

కరీంనగర్ తెలంగాణచౌక్, మే10: మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరపాలని శాంతిచర్చల కమిటీ చైర్మన్, విశ్రాంత న్యాయాధికారి చంద్రకుమార్ సూచించారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పౌర హక్కుల సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో వేలాది మంది కేంద్ర బలగాలు కర్రెగుట్టల్లో చేపడుతున్న కూంబింగ్‌తో ఆదివాసీలు, మావోయిస్టులు, పోలీసులు చనిపోతున్నారని చెప్పారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎల్కతుర్తి సభలో డిమాండ్ చేయగా ప్రజల నుంచి స్పందన వచ్చిందని తెలిపారు.

అనురాగ్ వర్సిటీ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ

అనురాగ్ వర్సిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు విజయ్ దేవరకొండ నియమితుడయ్యాడు. ఈ విషయాన్ని వర్సిటీ సీఈవో నీలిమా సూర్యదేవర వెల్లడించారు. విజయ్ నటించిన అనురాగ్ వర్సిటీ బ్రాండ్ ఫిల్మ్ వీడియో విడుదల చేశారు.

16 నుంచి సీఏ పరీక్షలు

న్యూఢిల్లీ : వాయిదా పడిన చార్టర్డ్ అకౌంటెంట్ కోర్సుల పరీక్షలు ఈ నెల 16 నుంచి 24 వరకు జరుగుతాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) శనివారం ప్రకటించింది. 9 నుంచి 14 వరకు జరగవలసి ఉన్న పరీక్షలు ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో 16కు మారాయి.

మ్యానిఫెస్టో హామీలను విస్మరించిన కాంగ్రెస్

- మున్నూరుకాపుల సంక్షేమానికి రూపాయి ఇవ్వలేదు
- ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్ ఫైర్

సమావేశంలో మాట్లాడుతున్న కొండా దేవయ్య పటేల్

ఖైరతాబాద్, మే 10 : స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు బీసీ కులాల్లో అత్యధికంగా నష్టపోయింది మున్నూరుకాపులేనని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మ్యానిఫెస్టో హామీలను విస్మరించిందని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండాదేవయ్య పటేల్ ఆరోపించారు. 'ఒకే కులం-ఒకే సంఘం' నినాదంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సంఘం రాష్ట్ర, జిల్లాల కమిటీలతో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1931 కులగణన సర్వేలో అత్యధికంగా ఉన్న మున్నూరుకాపులు, కాంగ్రెస్ చేసిన కులగణనలో తక్కువగా చూపినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా ఉన్న మున్నూరుకాపులు.. కులగణనలో మాత్రం మూడు శాతమే ఉన్నట్టు చూపి బీసీల్లో ఐదో స్థానంలో పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సైతం అన్యాయం చేశారని, ఇతర బీసీ కులాలకు నిధులిచ్చి మున్నూరుకాపులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. త్వరలోనే నూతన రాష్ట్ర కమిటీకి ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 30, 31 తేదీల్లో అమెరికాలో జరిగే మహాసభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్వీ మహేందర్‌కుమార్, గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు సంగాని రజినీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక కార్యకలాపాల కోసం హ్యూమనాయిడ్ రోబో

- మరో అద్భుత ఆవిష్కరణ దిశగా డీఆర్‌డీవో అడుగులు

పుణె, మే 10: అద్భుత ఆవిష్కరణలతో భారత సైనిక బలగాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) శాస్త్రవేత్తలు మరో సరికొత్త ఆవిష్కరణ దిశగా అడుగులు వేస్తున్నారు. సరిహద్దుల్లో నిర్వహించే క్లిష్టమైన సైనిక కార్యకలాపాల్లో మానవ ప్రమేయాన్ని తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించాలన్న లక్ష్యంతో హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తున్నారు. సైనికుల మాదిరిగా నడుస్తూ మానవ ఆదేశాలను స్వీకరించి సంక్లిష్టమైన బాధ్యతలను నిర్వర్తించగలిగే ఈ రోబోను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని కీలక రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఇంజినీర్స్) ల్యాబ్ అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు శనివారం వెల్లడించారు. గత నాలుగేండ్ల నుంచి తమ బృందం ఈ హ్యూమనాయిడ్ రోబో ప్రాజెక్టులో నిమగ్నమైనట్టు ఆర్‌అండ్‌డీఈ (ఇంజినీర్స్)లోని సెంటర్ ఫర్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ ఫర్ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ గ్రూప్ డైరెక్టర్ ఎస్‌ఈ తలోల్ తెలిపారు. అటవీ, పర్వత ప్రాంతాల్లాంటి కఠిన భూభాగాల్లో సైతం పనిచేయగలిగే విధంగా అభివృద్ధి చేశామని, అంతర్గత పరీక్షల్లో అవి కొన్ని పనులను విజయవంతంగా నిర్వర్తించగలిగాయని పీటీఐ వార్తా సంస్థకు వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఈ రోబోను ఇటీవల పుణెలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ప్రదర్శించామని, ఆపరేటర్ ఆదేశాలను అర్థం చేసుకుని, వాటిని సమర్థంగా అమలు చేయగలిగేలా ఈ రోబోను తీర్చిదిద్దడంపై తమ బృందం దృష్టి సారించినట్టు తలోల్ చెప్పారు.

రామన్నా.. ఆదుకోండి

- సౌదీలో రోడ్డు ప్రమాదం.. బీఆర్ఎస్ కార్యకర్తకు తీవ్రగాయాలు
- చికిత్స పొందుతున్న మహేశ్
- స్వదేశానికి తీసుకురావాలని విన్నపం
- ప్రమాదంపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సౌదీలో చికిత్స పొందుతున్న మహేశ్

సిరిసిల్ల రూరల్, మే 10: సౌదీలో 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డాడు. దవాఖానలో చికిత్స పొందుతున్న తనను స్వదేశానికి రప్పించాలని.. వైద్య ఖర్చులు అందించి ఆదుకోవాలని కోరుతూ స్థానిక నాయకులకు సెల్ఫీ వీడియో పోస్ట్‌చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన మంద మహేశ్ గతేడాది జరిగిన ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ప్రచారంలో పాల్గొన్నాడు. తర్వాత ఉపాధి కోసం సౌదీకి వెళ్లి ఏసీ మెకానిక్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 15 రోజుల క్రితం మహేశ్ వెళ్తున్న వాహనం మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8మంది అక్కడికక్కడే మృతి చెందగా, మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి సౌదీలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. నడుము, కాళ్లు విరిగి అచేతనస్థితిలో ఉన్న దయనీయ పరిస్థితిని వివరిస్తూ సెల్ఫీ వీడియో తీసి పార్టీ శ్రేణులకు పంపాడు. తనను స్వదేశానికి తీసుకురావాలని కన్నీరుమున్నీరుగా విలపించాడు. స్థానిక నాయకులు, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ ఈ విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించారు. ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి, మహేశ్‌ను స్వదేశానికి రప్పించేలా ఏర్పాటు చేస్తున్నట్టు పార్టీ నేతలు తెలిపారు. మహేశ్‌ను ఇంటికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: జాతీయ న్యాయ సేవల సంస్థ (నల్సా) కార్యనిర్వాహక చైర్మన్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈనెల 9న కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని నల్సా ఓ ప్రకటనలో తెలిపింది. అణగారిన, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు న్యాయం అందుబాటులో ఉండటంతోపాటు, ఉచిత న్యాయ సహాయం అందాలనేది నల్సా లక్ష్యమని తెలిపింది. నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవిలో ప్రస్తుతం జస్టిస్ బీఆర్ గవాయ్ ఉన్నారు. ఆయన ఈ నెల 14న భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయ సేవల కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు.

70 లక్షల లంచం .. సీబీఐ ట్రాప్

- హైదరాబాద్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ అరెస్టు
- షాపూర్జీ పల్లోంజీ కేసులో అప్పీల్‌కు వెళ్లా లంచం
- ఆయనతోపాటు మరో 14 మందిపై కేసు నమోదు
- హైదరాబాద్, ఖమ్మం సహా 18 చోట్ల తనిఖీలు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): డెబ్బై లక్షల రూపాయల లంచం తీసుకున్న కేసులో హైదరాబాద్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి లావుడ్య జీవన్‌లాల్‌నాయక్‌ను సీబీఐ అధికారులు శనివారం అరెస్టు చేశారు. ముంబైలోని షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు సంబంధించిన ఒక ట్యాక్స్ అప్పీల్ కేసు కోసం జీవన్‌లాల్ నేతృత్వంలో ఇన్‌కంట్యాక్స్ బృందం అక్కడికి వెళ్లింది. ఆ కేసు తీవ్రతను తెలుసుకున్న జీవన్‌లాల్ బృందం రూ. 70 లక్షల లంచం డిమాండ్ చేసినట్టు సీబీఐ ఆరోపిస్తోంది. ఈ విషయంపై బాధిత వ్యక్తులు సీబీఐని ఆశ్రయించగా, ఈనెల 9న మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశారు. మధ్యవర్తిగా ఉన్న సాజిదా మజ్హర్ హుస్సేన్ షాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం హైదరాబాద్ వచ్చిన ముంబై సీబీఐ అధికారులు ఈ కేసులో ప్రధాన సూత్రధారుడిగా ఉన్న జీవన్‌లాల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. జీవన్‌లాల్ ప్రస్తుతం హైదరాబాద్ ఇన్‌కంట్యాక్స్ (ఎగ్జంప్షన్) కమిసర్‌గా, అప్పీల్ యూనిట్స్ 7,8కు ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జీవన్‌లాల్‌తో పాటు ముంబైలోని షాపూర్ జీ పల్లోంజీ గ్రూప్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ (పన్నులు) ఉద్యోగి వైరల్ కాంతిలాల్ మెహతా, శ్రీకాకుళానికి చెందిన సైరాం పలిశెట్టి, వైజాగ్‌కు చెందిన నట్ట వీరనాగ శ్రీరామ్ గోపాల్, ముంబైకి చెందిన సాజిదా మజహర్ హుస్సేన్ షాను అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు.

ఏకకాలంలో 18చోట్ల తనిఖీలు

ఈ కేసులో మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు దేశవ్యాప్తంగా 18చోట్ల తనిఖీలు చేపట్టారు. ముంబై, హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్నం, న్యూఢిల్లీలలో సోదాలు చేశారు. సుమారు రూ. 69 లక్షలు నగదు సహా వివిధ నేరపూరిత పత్రాలు/వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముంబైలో అరెస్టు చేసిన వారిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చినట్టు సీబీఐ తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అరెస్టు చేసిన వారిని సంబంధిత న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టారు. సీబీఐ సోదాలు, అరెస్టులపై షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ స్పందించింది. ఈ కేసులో వారి డిప్యూటీ జనరల్ మేనేజర్ అరెస్టు కావడంతో అంతర్గత విచారణ ప్రారంభించింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతున్నదని సీబీఐ అధికారులు తెలిపారు.

'సీతమ్మ సాగర్' పూర్తికి పక్కా ప్రణాళిక

- గడువులోగా నీళ్లు అందించాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- ప్రాజెక్టు పురోగతిపై ఖమ్మం జిల్లా మంత్రులతో కలిసి సమీక్ష

హైదరాబాద్, మే10 (నమస్తే తెలంగాణ) : సమీకృత సీతారామ, సీతమ్మసాగర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులను సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నిర్దేశిత గడువులో ఆయకట్టుకు నీరందించాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి గోదావరి జలాలను అందించేందుకు సమీకృత సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, సీతమ్మ సాగర్ ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 7 లక్షల ఎకరాలకు నీళ్లు అందనున్నాయి. గత బీఆర్ఎస్ హయాంలోనే దాదాపు ప్రాజెక్టు ప్రధాన పనులన్నీ పూర్తయ్యాయి. డిస్ట్రిబ్యూటరీలను తవ్వాల్సి ఉన్నది. అయితే క్షేత్రస్థాయిలో భూసేకరణతోపాటు ఇతర సమస్యలు అడ్డొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పురోగతిపై ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంత్రి ఉత్తమ్ శనివారం జలసౌధలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల్లో ఎదురవుతున్న సవాళ్లను సీఈ శ్రీనివాస్‌రెడ్డి మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. భూ సేకరణ, కాల్వల తవ్వకం, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లందుకు సైతం సాగునీటిని అందించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మంత్రులను కోరగా, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉచిత బస్సులో గొడవ

కండక్టర్, ప్రయాణికుడి మధ్య ఘర్షణ

దంతాలపల్లిలో బస్సు డ్రైవర్‌తో ఘర్షణ పడుతున్న ప్రయాణికుడు

దంతాలపల్లి, మే 10 : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన ఆర్టీసీ ఫ్రీ బస్సుతో సౌకర్యం మాటెలా ఉన్నా ఘర్షణలే ఎక్కువగా జరుగుతున్నాయి. శనివారం సూర్యాపేట డిపో ఎక్స్‌ప్రెస్ బస్సు హనుమకొండకు వెళ్లి సూర్యాపేటకు తిరిగి వస్తుండగా, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలకేంద్రంలో కొందరు బస్సు ఎక్కారు. జీరో టికెట్ కోసం ఓ మహిళ ఆధార్ కార్డును ఇచ్చింది. పరిశీలించిన కండక్టర్ ఆధార్‌కార్డు అప్‌డేట్ కాలేదని, టికెట్‌కు డబ్బులివ్వాలని అడుగగా మరో ప్రయాణికుడు మహిళకు మద్దతుగా కండక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. డ్రైవర్ బస్సును పక్కకు ఆపడంతో ప్రయాణికుడు, కండక్టర్ ఒకరి చొక్కా మరొకరు పట్టుకుని ఘర్షణపడ్డారు. దంతాలపల్లి పోలీసులు చేరుకుని కండక్టర్, ప్రయాణికుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

జనాభా ఆధారిత పునర్విభజనతో దక్షిణాదికి నష్టం

- ఉత్తరాదిలో పెరుగుతున్న జనాభా
- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ నాగరత్న

న్యూఢిల్లీ, మే 10: జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోగలదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలలో జననాల రేట్లు తగ్గిన కారణంగా దక్షిణాదికి పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని ఆమె తెలిపారు. సరోగసీ(నియంత్రణ) చట్టం, 2021 నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై శనివారం విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. మొదటి శిశువు సహజంగా జన్మించినప్పటికీ సరోగసీ(అద్దె గర్భం) ద్వారా రెండవ శిశువును పొందేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అనేక జంటలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర